క్లుప్తంగా

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

• కార్పొరేటర్ పగుడాల శిరీష



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శిరీష తదితరులు

మూసాపేట: వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు అన్నారు. డివిజన్ అధ్యక్షులు సీహెచ్. ప్రభాకర్ గౌడ్ నివాసంలో సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పని అయిపోయిందని మాట్లాడే వారికి ఈ సభతో సమాధానం చెప్పాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతను తీసుకొని సభను విజయవంతం చేయాలన్నారు. అనంతరం చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు అనిత శ్రీపాద, అరుణ శెట్టి, సీనియర్ నాయకులు పవన్ కుమార్, పాతూరి గోపి, జశ్వంత్, హరినాథ్, ముత్యపాగ శ్రీనివాస్, ఖాదీర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ ఫేజ్ 1 సమస్యలను పరిష్కరిస్తా



సమావేశంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ ఫేజ్ 1 కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కాలనీ వాసులతో భాగ్యనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో కాలనీ వాసులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. సమావేశంలో వాటర్‌వర్క్స్ సూపర్‌వైజర్ నరేంద్ర, జీహెచ్ఎంసీ ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, హార్టికల్చర్ డిపార్టుమెంట్ దాసు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ




ఎం. జ్యోతిలక్ష్మి



వై. మౌనిక



ప్రియాంక గుప్తా



అమృత కుమారి

మూసాపేట: ఇంటర్ ఫలితాల్లో కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం కళాశాల ప్రథమ టాపర్‌గా ఎంపీసీ విద్యార్థిని ఎం. జ్యోతిలక్ష్మి 466/470 సాధించింది. కళాశాల రెండో టాపర్‌గా ఎంపీసీ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని వై. మౌనిక నిలిచింది. 452/470 మార్కులు సాధించింది.
– ద్వితీయ సంవత్సరం కళాశాల టాపర్‌గా బైపీసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని ప్రియాంక గుప్తా 990/1000, రెండో టాపర్‌గా అమృత కుమారి ఎంపీసీ విద్యార్థిని 973/1000 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య విద్యార్థులను అభినందించారు.

హెచ్‌సీయూలో ప్లాంటేషన్ డ్రైవ్

రాయదుర్గం: హెచ్‌సీయూలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో 'ఎర్త్ డే'ను పురస్కరించుకొని 'ట్రీ ప్లాంటేషన్ డే' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సభ్యులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేయాలి

• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని వివిధ చెరువులను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐడీఎల్ చెరువు, బోయిన చెరువు, ములకత్వ చెరువు, నల్ల చెరువులో కొంత భాగం సుందరీకరణ చేశామని, వాటిపై కేసులు ఉండటం వల్ల పూర్తిగా అభివృద్ధి జరగలేదని వివరించారు. దానిపై న్యాయస్థానం ద్వారా వివరాలను సేకరించి చెరువులను సుందరీకరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భూ యజమానులు టీడీఆర్ ఇచ్చే సమయంలో వారి దగ్గర కొనుగోలుదారులు ఎవరో, అమ్మినవారెవరో నిజానిజాలు తెలుసుకొని వారికి టీడీఆర్ ఇచ్చే విధంగా చూడాలన్నారు. చెరువులను అభివృద్ధి చేసే సమయంలో నల్ల చెరువు, ఐడీఎల్ చెరువు లాంటి వాటికి నాలా డైవర్షన్ ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అమృత్‌నగర్‌తండా వాసులు వర్షాలు వస్తే మునిగిపోయి డ్రైనేజీ నీరు ఇళ్లలోకి వచ్చే ప్రాంతంలో నివసిస్తున్నారని వివరించారు. ఇప్పటికే 70 మంది కుటుంబాలకు గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇప్పించామని, పెండింగ్‌లో ఉన్న 60 మంది నిరుపేదలకు కై త్లాపూర్‌లోని డబుల్‌బెడ్ రూమ్‌లు ఇప్పించాలని కోరారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



సమీక్షా సమావేశంలో పీఏసీ చైర్మన్ గాంధీ, అధికారులు

• పెండింగ్ పనుల్లో అలసత్వం వద్దు
• పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, చేపటాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అధికారులు రోడ్డు కటింగ్ సమయంలో మంచినీటి పైపులైన్, డ్రైనేజీ పైపులైన్లు వేసేటప్పుడు తవ్విన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. యూజీడీ, రోడ్ల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా వ్యవస్థను సరిగ్గా నిర్వహించాలన్నారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, స్వచ్ఛమైన తాగునీరును అందించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, ఇంజినీరింగ్ అధికారులు ఏఈలు రాజీవ్, నిఖిల్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



హర్షం వ్యక్తం చేస్తున్న నేతలు, కాలనీ వాసులు

మోతీనగర్: దేశంలోనే గ్రేటర్ హైదరాబాద్‌ని అంతర్జాతీయ నగరాలతో అభివృద్ధిలో పోటీ పడేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని కాంగ్రెస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్‌లో 8 నుంచి 11 రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండటంతో వాటిని పూర్తి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారని తెలిపారు. ఈ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభమయ్యే విధంగా కృషి చేసిన బండి రమేష్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రవి, ధర్మారావు, చప్పిడి శ్రీనివాస్, పవన్, ఆంజనేయులు, బొంత రవి, సతీష్ రెడ్డి, సుబ్బయ్య చౌదరి, అన్వర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


• కార్పొరేటర్ సబిహా బేగం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్‌లో మంగళవారం 8 నుంచి 11 రోడ్లలో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో ఇప్పటికే పలు బస్తీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, చైర్మన్ తుంగం శ్రీనివాసరావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, బీఆర్ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి, నాయకులు సుందర శేషారావు, జ్ఞానేశ్వర్, రవీందర్ రెడ్డి, గుత్తికొండ రామకృష్ణ, కమ్మరి శ్రీనివాస్, సుబ్బయ్య చౌదరి, వీరాంజనేయులు, యోగిరాజు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భార్య, అత్తపై అల్లుడి దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి


మియాపూర్: భార్యా భర్తల మధ్య ఏర్పడిన వివాదం దాడికి దారి తీసింది. భార్యపై భర్త కత్తితో దాడి చేయగా..అడ్డుగా వచ్చిన అత్తను సైతం కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు..సీఐ క్రాంతి కుమార్ తెలిపిన ప్రకారం..కాకినాడకు చెందిన బండారులంక మహేష్ మియాపూర్ జనప్రియనగర్ రోడ్డు నెం.5 శ్రీ వెంకట నిలయంలో భార్య శ్రీదేవి, రెండేళ్ల కుమార్తెతో కలిసి ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మహేష్ తన సంపాదనను ఇంటి ఖర్చులకు ఇవ్వకుండా..మద్యం తాగేందుకు ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయంలో భార్య శ్రీదేవితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం శ్రీదేవి చందానగర్ హుడాకాలనీలో ఉంటున్న తల్లి మంగ ఇంటికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం శ్రీదేవికి ఫోన్‌చేసి ఇంటికి తిరిగి రమ్మని మహేష్ కోరగా..ఆమె మధ్యాహ్నం ఒంటి గంటకు కుమార్తెతో కలిసి వచ్చింది. అదేరోజు సాయంత్రం మహేష్ తన సోదరుడు సాయికుమార్ పుట్టిన రోజు ఉందని, జనప్రియ కాలనీలో ఉంటున్న తమ తల్లిదండ్రుల ఇంటికి వెళ్దామని చెప్పాడు. దీనికి శ్రీదేవి నిరాకరించడంతో ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఈ విషయాన్ని శ్రీదేవి తల్లి మంగకు ఫోన్ చేసి చెప్పగా ఆమెకూడా ఇక్కడికి వచ్చింది. దాడిని ప్రశ్నించడంతో ఆవేశానికి లోనైన మహేష్ వంటగదిలోకి వెళ్లి కూరగాయలు కోసే కత్తి తీసుకుని వచ్చి మొదట శ్రీదేవిపై దాడి చేశాడు. వారించేందుకు వెళ్లిన అత్త మంగను విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ఆమె తీవ్రంగా గాయపడగా..స్థానికులు గమనించి ఇద్దరినీ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై శ్రీదేవి భర్త మహేష్‌పై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడు మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

క్రీడలు ఐకమత్యాన్ని చాటుతాయి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లో పీజీ విద్యార్థులకు నాలుగు రోజులుగా నిర్వహించిన క్రీడాకౌశలం పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు, ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందించారు. హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్ గైడెన్స్ అండ అడ్వైజరీ బ్యూరో చైర్మన్ ప్రొఫెసర్ చరణ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ భూమి తల్లిలాంటిదని, భూమిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రెరా చైర్మన్ మాజీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె అశోక్, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని కీసర సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు, యాత్రికులు పోలీసుల సూచనల మేరకు వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా క్యూలైన్లలోని భక్తులకు వీలైనంత త్వరగా స్వామి దర్శనం కలిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్‌కు సూచించారు.

భూ భారతిపై సందేహాలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి

• మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం
• తూంకుంటలో అవగాహన సదస్సు



పాల్గొన్న రైతులు, స్థానిక నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ కలెక్టర్ గౌతం

శామీర్‌పేట్: భూ భారతిపై ఎలాంటి సందేహాలున్నా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. తూంకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శామీర్‌పేట మండల ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ప్రైవేట్ సర్వేయర్లను నియమించవద్దని రైతులు కలెక్టర్‌ను కోరగా, భూమి కొనుగోలు, విక్రయాలు రిజిస్ట్రేషన్ సమయంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ ఆమోదించిన తర్వాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీనివల్ల ఎవరికీ నష్టం జరగదని పకడ్బందీగా భూ సరిహద్దులు ఉంటాయని కలెక్టర్ వివరించాడు. అంతేగాకుండా సదరు రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని తెలిపారు. ధరణి వల్ల పీఓబీ సమస్యలు అధికంగా ఉన్నాయని, భూ భారతి చట్టంలో పీఓబీ రద్దుచేసే అధికారం కల్పించారని పేర్కొన్నారు.
అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందని, ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థతో రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్‌లో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరించిన కేటీఆర్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను సమిష్టిగా విజయవంతం చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం నందిహిల్స్‌లోని ఆయన నివాసంలో చలో వరంగల్ రజతోత్సవ వాల్ పోస్టర్‌ను పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ కృత్రిమ పదార్థాల వినియోగంపై శిక్షణ

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో రహదారుల వ్యవస్థలో భూకృత్రిమ పదార్థాల వినియోగంపై ఐదు రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. కేంద్ర రోడ్డు పరిశోధన సంస్థ, భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ప్రాయోజిత జాతీయ సాంకేతిక వస్త్ర సాధన పథకం కింద కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులుగా సీఆర్ఆర్ఐ సంచాలకులు, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య డా.మనోరంజ్ పరిడా, సీఆర్ఆర్ఐ సంస్థలోని సీఎస్ఐఆర్‌కి చెందిన వివిధ విభాగాల శాస్త్రవేత్తలు డా. పులికంటి సుబ్రహ్మణ్య ప్రసాద్, డా.కై తా రవీందర్, డా.గొట్టుముక్కల భరత్ పాల్గొన్నారు.

శ్రీశ్యాం స్టీల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న డీసీఎం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

• వెల్డింగ్ చేస్తుండగా మిరుగులు పడి ఆయిల్ డ్రమ్ములకు మంటలు
• డీసీఎం దగ్ధం

జీడిమెట్ల: జీడిమెట్లలోని శ్రీశ్యాం స్టీల్ పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేస్తుండగా మిరుగుల పడి ఆయిల్ డ్రమ్ములు అంటుకున్నాయి. డీసీఎం పూర్తిగా దగ్ధమైంది. ఫైర్‌సిబ్బంది వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో రవి అగర్వాల్ అనే వ్యక్తి శ్రీశ్యాం స్టీల్ పేరిట ఇంజినీరింగ్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. పరిశ్రమలో ఆయిల్ డ్రమ్ములు ఉన్న చోట పరిశ్రమకు చెందిన డీసీఎం వాహనానికి నలుగురు వ్యక్తులు వెల్డింగ్ పనులతో మరమ్మతులు చేస్తున్నారు. అదే సమయంలో ఆయిల్ డ్రమ్ముల వద్ద వెల్డింగ్ చేస్తుండగా మిరుగులు పడి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ప్రమాదం గమనించిన వ్యక్తులు ఒక్కసారిగా అక్కడనుంచి పరారయ్యారు. మంటలు డీసీఎంకు అంటుకుని దగ్ధమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. పరిశ్రమ లోపల ఉన్న ట్రాన్స్‌పార్మర్ సైతం పేలిపోయింది.

డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధి ప్రగతి నగర్‌లోని అంబర్ చెరువు కలుషితం కాకుండా నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కోరారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి నగర్ మాజీ కార్పొరేటర్ ఇంద్రాజిత్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డయాగ్నొస్టిక్ సేవలు భేష్!

• తలసీమియా నిర్ధారణ పరీక్షల్లో జిల్లాలో మొదటిస్థానం
• మార్చి నెలలో 94 పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు 2017లో డయాగ్నొస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలోని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలు, 40 కేంద్రాల్లో తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాలు పని చేస్తున్నాయి. మార్చిలో జిల్లాలోని 91 తలసీమియా పరీక్షలు నిర్వహించి ప్రథమంగా నిలిచింది. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణలో బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందంజలో ఉంది. షుగర్, బీపీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్షలు, లివర్ సంబంధిత పరీక్షలు, లిక్విడ్ ప్రొఫైల్ పరీక్షలు, 54 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

వైద్య పరీక్షలకు...

వైద్య పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డు తీసుకొని వస్తే చాలు. రక్తపరీక్షల వివరాలు వారి ఫోన్ నెంబర్‌కే అందజేస్తారు. పేదలకు ఉచితంగా ఖరీదు అయిన సేవలు అందిస్తున్నారు. ఎటువంటి రోగ నిర్ధారణ పరీక్షలు అయినా చేస్తారు. సామాన్యులకు కార్పొరేట్ సేవలు లభిస్తున్నాయి. ప్రజలు గతంలో ప్రభుత్వ హాస్పిటల్ వైపు కన్నెత్తి చూసే వారు కాదు. నేడు ప్రభుత్వ హాస్పిటల్‌లో డయాగ్నొస్టిక్ సేవలకు ఆదరణ పెరుగుతోంది.

“

కచ్చితత్వంతో పరీక్షలు



వ్యాధి నిర్ధారణ కోసం చేసే అనేక రకాల పరీక్షలు బయట వేల రూపాయలు అవుతున్నాయి. నాణ్యత, కచ్చితత్వంతో పరీక్షలు చేస్తున్నారు. బాలానగర్‌లో మంచి సేవలు అందుతున్నాయి. రూపాయి ఖర్చు లేకుండా అన్ని వర్గాలకు వైద్య సేవలు అందిస్తున్నారు.
– రిషియాదవ్, స్థానికుడు